www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 15 జనవరి 2023

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

6లో..

ఏలూరులో ముగ్గుల పోటీల్లో మహిళలు

బరి తెగింపు..!

యథేచ్ఛగా కోడి పందేలు.. ఎంఎల్‌ఎలే ప్రారంభోత్సవాలు

కోర్టు ఆదేశాలు తుంగలోకి.. చేతులెత్తేసిన పోలీసులు

విచ్చలవిడిగా గుండాట, మూడు ముక్కలాట

ప్రతి మండలంలోనూ పదికిపైగా బరుల్లో పందేలు జోరు

దుంపగడప బరిలో బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్

ప్రతి పోలీస్ స్టేషన్‌కూ రూ.ఏడెనిమిది లక్షలు మామూళ్లు?

జంగారెడ్డిగూడెం మండలంలో..

కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కారు.. ప్రతియేటా మాదిరిగానే ఈసారి బరి తెగించి మరీ రెండు జిల్లాల్లోనూ కోడి పందేలు నిర్వహిస్తున్నారు. అడ్డుకుంటామని బీరాలు పలికిన పోలీసులు ప్రభుత్వ అనధికార ఆదేశాలతో ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. దీంతో రెండు జిల్లాల్లోనూ 400కుపైగా బరుల్లో శనివారం భోగి రోజు కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. పలుచోట్ల ఎంఎల్‌ఎలే పందేలను ప్రారంభించిన పరిస్థితి ఉంది. తొలిరోజు రూ.కోట్ల సొమ్ము బెట్టింగుల రూపంలో చేతులు మారింది. గుండాట, మూడు ముక్కలాటలు విచ్చలవిడిగా కొనసాగాయి. అత్యధిక పందేలు గెలిచిన వారికి బైక్‌లు బహుమతులుగా ప్రకటించిన తీరు పందేల జోరుకు అద్దం పడుతోంది.

జంగారెడ్డిగూడెంలో..



ఏలూరు రూరల్ మండలంలో పేకాటలో మహిళలు..

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా కోడి పందేలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పందేలను అడ్డుకోవాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినా అడ్డుకోవాల్సిన పోలీసులు పందెం మూడు రోజులు ప్రేక్షక పాత్రకు పరిమితమై మామూళ్ల లెక్కలు చూసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రతియేటా మాదిరిగానే ఈ సంక్రాంతి పండుగ సైతం జూద క్రీడలకు వేదికగా మారింది. శుక్రవారం సాయంత్రం వరకూ కోడి పందేలను అడ్డుకుంటామని పోలీసులు బీరాలు పలికారు. శనివారం భోగిరోజు ప్రభుత్వ అనధికార ఆదేశాలతో పోలీసులు చేతులెత్తేశారు. దీంతో మరోసారి పందెంరాయుళ్లు పైచేయి సాధించారు. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో తొలిరోజు భోగి పండుగ నాడు యథేచ్ఛగా కోడిపందేలు సాగాయి. ప్రతి మండలంలోనూ పదికిపైగా బరుల్లో పందేలు సాగిన పరిస్థితి నెలకొంది. భీమవరం మండలం గొల్లవానితిప్పలో దేగాపురం, పాలకొల్లు బైపాస్ పక్కన, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, దేవులపల్లి, పెదవేగి మండలంలో కొండలరావుపాలెం, దెందులూరు మండలం శ్రీరామవరం, ఆకివీడు మండలం దుంపగడప, కైకలూరు మండలం ఆలపాడు, కాళ్ల మండలం సీసలిలో భారీస్థాయిలో కోడిపందేలు కొనసాగుతున్నాయి. ఆకివీడు మండలం దుంపగడపలో తొమ్మిది పందేలకుగాను ఐదు పందేలు గెలిచిన వారికి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ బహుమతిగా ప్రకటించడంతోపాటు బరి వద్ద ప్రదర్శనగా పెట్టడం గమనార్హం. సీసలిలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి శివరామరాజు, పాలకొల్లులో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ మేకా శేషుబాబు, బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి పాల్గొని పందేలను ప్రారంభించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు కోడిపందేల్లో కీలక పాత్ర పోషించారు. దేగాపురం పందేలకు యువ సినీ హీరో కిరణ్ అబ్బవరం హాజరయ్యారు.

తొలి రోజు రూ.50 కోట్లు మేర బెట్టింగ్..?

భోగి రోజు శనివారం కోడి పందేల్లో రూ.50 కోట్లకుపైగా బెట్టింగ్ జరిగినట్లు అంచనా వేస్తున్నారు. పెద్దబరుల్లో ఒక్కో పందేనికి రూ.ఐదు నుంచి రూ.పది లక్షల వరకూ పందేలు సాగాయి. గుండాట, మూడు ముక్కలాటల్లో పెద్దఎత్తున సొమ్ము చేతులు మారింది. రెండో రోజు ఆదివారం పెద్దపండగ రోజు జోరు మరింత ఉధృతంగా సాగనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. పందేలకు యువత, సామాన్య ప్రజానీకం ఆకర్షితులై జేబులు గుల్ల చేసుకుంటున్నారు. బరుల ప్రాంతాలన్నీ జాతరను తలపిస్తున్నాయి. రాత్రిపూట సైతం యథేచ్ఛగా పందేలు సాగేందుకు ఫ్లడ్‌లైట్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. పెద్దపెద్ద బరుల వద్ద ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో బౌన్సర్లను నియమించారు.

ముదినేపల్లి మండలంలో..



ముసునూరు మండలంలో..

ప్రతి స్టేషన్‌కూ రూ.ఏడెనిమిది లక్షలు మామూళ్లు

పందేలు నిరాటంకంగా సాగేందుకు, పోలీసుల నుంచి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు పందెం నిర్వాహకులు పోలీసులకు పెద్దఎత్తున మామూళ్లు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది. బరుల ప్రాతిపదికన రూ.30 వేల నుంచి రూ.లక్షకుపైగా మామూళ్లు ఇచ్చినట్లు సమాచారం. ప్రతి పోలీస్ స్టేషన్‌కు మామూళ్ల రూపంలో రూ.ఏడెనిమిది లక్షలు అందినట్లు తెలుస్తోంది. గుండాట, మూడు ముక్కలాట నిర్వాహకుల నుంచి కూడా పోలీసులకు పెద్దఎత్తున మామూళ్లు ముట్టినట్లు ప్రచారం సాగుతోంది. భోగిరోజు మధ్యాహ్నం నుంచి గుండాట, మూడు ముక్కలాటలు నిలుపుదల చేయాలని పైనుంచి పోలీసులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే మామూళ్లు అందుకోవడంతో పెద్దగా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పండుగ మూడు రోజులు పందేల రూపంలో రూ.కోట్లు చేతులు మారే పరిస్థితి కన్పిస్తోంది. వేలాది మూగజీవాలు బరిలో ప్రాణాలు వదలనున్నాయి.

బుట్టాయగూడెంలో..

చింతలపూడిలో..

భోగి మంటల్లో జిఒ1 కాపీలు

పౌరహక్కులు, ప్రజాసంఘాలు, వామపక్షాలు, టిడిపి ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రోడ్ షోలు, బహిరంగ సభలు, సమావేశాలపై నిర్బంధాలను విధిస్తూ తీసుకొచ్చిన జిఒ 1ని రద్దు చేయాలని కోరుతూ శనివారం జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. ఈ సందర్భంగా భోగి మంటల్లో జిఒ కాపీలను వేసి దహనం చేశారు. సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, టిడిపి, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

దెందులూరు మండలంలో..

ఏలూరు : జిఒ1ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిఒ కాపీలను స్థానిక పత్తేబాధ మనకావారివీధిలో భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కింజింగి రాజు, మరక భుజంగరావు, నేలపాటి బాలు, పిచ్చుక అప్పారావు చేతివృత్తిదారులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : జిఒ 1ను రద్దు చేయాలని కోరుతూ రెడ్డిగణపవరం, గుర్రపుగుంటలో కెవిపిఎస్ ఆధ్వర్యాన జిఒ1 కాపీలను భోగిమంటల్లో కాల్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేకత ప్రజల్లో కనిపించకుండా ఉక్కుపాదంతో అణిచేందుకే ఈ జిఒను తీసుకొచ్చారన్నారు. జిఒను రద్దు చేయకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటేష్, పి.వెంకటేష్, నిర్మల, వీరమ్మ, రమణ, రాజ్యలక్ష్మి, బి.జయరాజ్, వెంకటేశ్వరమ్మ, టి.పూర్ణచంద్, దవులూరిరాజు, బి.ప్రసాద్, టి.గణేష్ పాల్గొన్నారు.

దెందులూరు : సమస్యలపై నిరసన తెలిపేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కును హరించే జిఒ1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పోతునూరు శివారు ఉండ్రాజవరం ఆంజనేయస్వామి గుడ సెంటర్‌లో జిఒ కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్ షోలు, ప్రదర్శనలు, సభలు నిర్వహించకూడదని తీసుకొచ్చిన ఈ జిఒను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల నుండి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలివ్వాలని కోరారు. ఎరువులు పురుగుల మందుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, కడగళ్ల రామాంజనేయులు, జరజాపు అచ్చారావు, జరజాపు శ్రీనివాసరావు, జంగం చిన్న, గుంట వీరాంజనేయులు పాల్గొన్నారు.

చాట్రాయి : జిఒ 1 కాపీలను సిఐటియు ఆధ్వర్యాన స్థానిక సెంటర్లో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొలికిపోగు భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : కార్మికులు తమ సమస్యలపై నిరసన తెలిపే హక్కును హరించే జిఒ1ని రద్దు చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు సీరా అప్పారావు, కె.వెంకట్రావు డిమాండ్ చేశారు. శ్రీఅభ్యుదయ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేబ్రోలు సెంటర్‌లో జిఒ కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు.

గణపవరం : జిఒ1ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కేశవరం, అప్పన్నపేట, జల్లికాకినాడ, ముప్పర్తిపాడు గ్రామాల్లో జిఒ ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.గోవిందు. పి.నరసింహమూర్తి, నరాలశెట్టి రామకృష్ణ, ఎం.పెంటారావు, పివిఆర్.సుబ్రహ్మణ్యం ఎస్.సంజీవరావు, కేతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : జిఒ1 ప్రజాస్వామ్య విరుద్ధమని సిపిఎం సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జిఒను నిరసిస్తూ ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు.

చింతలపూడి : జిఒ1ను రద్దు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్‌విఎస్ సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక బోసు బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బోగి మంటల్లో జిఒ కాపీలను వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బాబు, వెంకటేశ్వరరావు, తిరుమల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

జంగారెడ్డిగూడెం : జిఒ1ను రద్దు చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో జిఒ కాపీలను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతి పేరుతో వ్యసనాల బారినపడొద్దు : సిపిఎం

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి పండుగ ముసుగులో నిర్వహిస్తున్న కోడి పందేలు, జూదం, మద్యం అక్రమ అమ్మకాలు అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు బొడ్డు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీవరత్నం మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, జూదం పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు . వీటివల్ల పేద కుటుంబాలు, సామాన్యులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వాపోయారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతుందని జీవరత్నం ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వం పెద్దఎత్తున సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని కోరారు. మండలంలో ఇప్పటికే కోడిపందేలు, పేకాట శిబిరాల కోసం వందలాది బరులు పందేల రాయుళ్లు తయారు చేశారని, పోలీసులు ఇప్పటివరకూ గస్తీ కాసినప్పటికీ గత సంవత్సరం మాదిరి పండుగ మూడు రోజులు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు రోజులు సంక్రాంతి సంబరాలు నిర్వహించి గ్రామాల్లో కోడిపందేలు, జూదం వంటి ఆటలను నిర్మూలించాలన్నారు. ఈ సంక్రాంతికి సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పెద్ద ఎత్తున సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్‌రావు, పిల్లి చంటి, బొబ్బిలి గంగరాజు, పి.సునీల్ పాల్గొన్నారు.

కోడిపందేల్లో గ్యాస్ సిలిండర్ లీక్

పరుగులు తీసిన జనం

చాట్రాయి: మండలంలోని పోతనపల్లి, చిన్నంపేట గ్రామాల సరిహద్దులో శనివారం నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరం వద్ద ఏర్పాటు చేసిన బిర్యాని సెంటర్‌లోని గ్యాస్ సిలిండర్ లీకై మంటల ఎగసిపడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందేల వద్ద బిర్యాని షాపులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తీసుకొచ్చిన ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ లీకై ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అక్కడకు వచ్చిన జనం బయటకు పరుగులు తీశారు. అయితే సిలిండర్ పేలకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు ఇసుకను ఉపయోగించి మంటలను అదుపుచేశారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

కోడి పందాలలో ప్రముఖులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణ, మండల ప్రాంతాల్లో నిర్వహించిన కోడిపందేల్లో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దగ్గరుండి పందేలను ప్రోత్సహించారు. మండలంలోని శ్రీనివాసపురంలో ఏర్పాటుచేసిన పందెం బరిని జెడ్‌పిటిసి సభ్యులు పి.శ్రీనివాసరావు (బాబ్జీ) రిబ్బన్ కట్ చేసి మరీ పందేలను ప్రారంభించారు. ఆయనతోపాటు పట్టణ ప్రముఖులు డికెడి.సత్యనారాయణ, పరిమి సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సుబ్బంపేటలో ఏర్పాటుచేసిన కోడిపందేలను టిడిపి నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, మాణిక్యాల నాగేశ్వరరావు ప్రారంభించారు. లక్కవరంలో వైసిపి నాయకులు వి.హరిబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఆగిరిపల్లి: శతాధిక వృద్ధురాలు, సిపిఎం మండల కమిటీ సభ్యులు షేక్ సుభానీ అమ్మమ్మ షేక్ మైమూన్(102) శనివారం వయోభారంతో ఆమె స్వగృహంలో మృతి చెందారు. ఆమె మృతికి సిపిఎం నేతలు సంతాపం తెలిపారు.

ఏదీ నాటి సంక్రాంతి శోభ..!

ప్రభుత్వ విధానాలతో రైతన్న విలవిల

పండుగ అంటే పందేలుగా మార్పు

సంక్రాంతి అంటే పల్లెల్లో ఇంటిల్లపాది సందడే.. సార్వా పంట చేతికొచ్చి.. దాళ్వా సాగు సమయం కావడంతో ప్రత్యేకంగా రైతుల ఇంట సంక్రాంతి శోభ వెల్లివిరిసేది. ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడిన వ్యవసాయ కూలీలు, ఇతర చేతివృత్తిదారుల ఇంటా పండుగ సందడి ఉండేది. ఇది ఒకనాటి పరిస్థితి. ప్రస్తుతం పల్లె ముఖచిత్రం మారింది. ఫలితంగా సంక్రాంతి సందడి కోడిపందేల బరుల వద్ద తప్ప మిగిలిన చోట్ల పెద్దగా కానరాని పరిస్థితి నెలకొంది.

ఆరేడు ఏళ్ల క్రితం వరకూ రైతు రోడ్డెక్కడమంటే ధాన్యం ధర గురించో.. సాగునీటి కోసమో అయ్యేది. గిట్టుబాటు ధర అటుంచి కనీసం మద్దతు ధర ఇవ్వండంటూ రైతులు ఆందోళన చేయడం పరిపాటి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపరిహారం కోసం ఆందోళన చేపట్టాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అంటే ఆ సమస్యలన్నీ పరిష్కారమై పోయాయని, అందువల్ల ఆయా అంశాల గురించి మాట్లాడటం లేదంటే పొరపాటే. అసలు పండించిన పంటే కొనని పరిస్థితుల్లో ఇక ధర గురించి మాట్లాడే పరిస్థితి ఎలా ఉంటుంది. ఇటీవల ఆచంట మండలంలో పలు గ్రామాల్లో కౌలు రైతులు ట్రాక్టర్లపై ధాన్యం లోడు చేసినా మిల్లులకు పంపేందుకు రైతుభరోసా కేంద్రం సిబ్బంది టార్గెట్ పూర్తయిపోయిందని చెప్పడమే దీనికి నిదర్శనం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సార్వా ధాన్యం అమ్మకాల్లో రైతులు నానావస్థలు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కొనుగోలు విధానం. ఇంతకుముందు ధాన్యం సొమ్ము కోసం పడిగాపులు పడే పరిస్థితి నుంచి తమ వద్ద నుంచి ధాన్యం మిల్లులకు ఎప్పుడు తీసుకెళ్తారనే పరిస్థితికి ఈ విధానం తీసుకొచ్చింది. ధాన్యం సొమ్ము కోసం పడిగాపులు పడటం అటుంచి తమ ధాన్యం ఎప్పుడు



కొంటారంటూ ఆర్‌బికెల వద్ద పడిగాపులు పడే దుస్థితి ఏర్పడింది. గత దాళ్వా సీజన్ వరకూ అమ్మిన ధాన్యం సొమ్ము కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. సార్వా ధాన్యం చేతికొచ్చే సమయానికి గత దాళ్వా ధాన్యం సొమ్ము కొంతమంది రైతులకు అందని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు. తాజాగా కొత్త విధానంతో రైతులు ఆర్‌బికెల చుట్టూ ప్రదక్షిణలు తిరగడం, మిల్లుల వద్ద తేమ శాతం తేడాలతో సొమ్ము ఎదురు కట్టాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. దాళ్వా నాట్లు పూర్తయ్యే దశలోనూ రెండు జిల్లాల్లోనూ ధాన్యం అమ్మకాలు సాగుతుండటం రైతుల దయనీయ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఈ క్రమంలో ఇటు దాళ్వా పెట్టుబడులకు సొమ్ము లేక నానాఅవస్థలు పడుతున్న రైతుల ఇంట సంక్రాంతి శోభ ఎలా వస్తుందో ప్రభుత్వమే చెప్పాలి. ఇక జిల్లాలో ఆక్వా రైతుల పరిస్థితీ ఇబ్బందికరంగానే ఉంది. ధర సమస్యతోపాటు ఇతర సమస్యలు ఆక్వా రైతులను వెంటాడుతున్నాయి. పామాయిల్ రైతులు సాగు చేద్దామంటే మొక్కలు అందుబాటులో లేక, మిర్చి రైతులు తామర, నల్లి పురుగు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. అదే సమయంలో యంత్రాల రాక, వరిసాగు విస్తీర్ణం తగ్గడం తదితర కారణాల రీత్యా వ్యవసాయ కార్మికులు పనుల్లేక ఉపాధి కోసం పట్నం బాట పట్టి భవన నిర్మాణ కార్మికులుగా మారారు. పెరిగిన ధరలతో నిర్మాణ రంగం మందగించడంతో అక్కడా పనుల్లేని పరిస్థితుల్లో పేదల పరిస్థితి దయనీయంగా మారింది. దీనికితోడు ఆర్థిక మాంద్యం నీలినీడలు నేపథ్యంలో కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగుల తొలగింపునకు పూనుకోవడం, కొత్తగా ఉపాధి అవకాశాలు పెద్దగా లభించకపోవడంతో సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన వారు పండుగకు సొంతూళ్లకు చేరుకున్నా గతంలో ఉన్నటువంటి హుషారు లేదు. మొత్తంగా ప్రభుత్వ విధానాల ఫలితంగా జిల్లాలో కోడిపందేల వద్ద తప్ప మిగిలిన చోట్ల సంక్రాంతి శోభ పెద్దగా కానరాని పరిస్థితి ఉంది.

పండుగ అంటే పందేలేనా..!

జిల్లాలో సంక్రాంతి అంటే పిండి వంటలు, కొత్త బట్టలు, డూడూ బసవన్నల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, ఇళ్ల ముంగిట రంగవల్లులు వంటి సందడి పక్కకుపోయి కోడిపందేలే అనే పరిస్థితి కన్పిస్తోంది. భోగి రోజున భోగి మంటల దగ్గర నుంచి కొత్త బట్టలు వంటి హడావుడి పెద్దగా కానరాని పరిస్థితి ఉంది. అయితే ఏదెలాగున్నా పండుగ సందడి మాత్రం కోడి పందేల బరుల వద్ద కన్పించింది. గతంలో మాదిరి భోగి రోజు మధ్యాహ్నం వరకూ కూడా ఆగాల్సిన అవసరం లేకుండానే ఉదయం నుంచే పందేలు ప్రారంభం కావడంతో పందెంరాయుళ్లు, యువత అటువైపు పరుగులు తీశారు. తమ విధానాలతో రైతుకూలీలకు, పేదలకు, చేతివృత్తిదారులకు, చిన్నవ్యాపారులకు పండుగను దూరం చేసిన ప్రభుత్వం కోడిపందేల విషయంలో మాత్రం గత ప్రభుత్వానికి తీసిపోమన్నట్లు వ్యవహరించిందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఎన్‌పిఆర్‌డి అధ్యక్షులు సత్యనారాయణ మృతి

సత్యనారాయణ (ఫైల్)

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎన్‌పిఆర్‌డి మండల అధ్యక్షులు ఆవుల సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారయణ శనివారం ఉదయం మృతి చెందారని బంధువులు తెలిపారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారని ఎన్‌పిఆర్‌డి మండల సభ్యులు కొనియాడారు. ఆవుల సత్యనారాయణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జగన్నాథునికి వెండి కిరీటం వితరణ

కిరీటం అందిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సహిత శ్రీజగన్నాథ స్వామివారికి గ్రామ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మూడు కేజీల వెండి కిరీటం వితరణగా అందించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎస్.శ్రీనివాసరావుకు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి, మాజీ ఎంపిపి వీరమల్లు నరసింహారావు, గురువు సుబ్రహ్మణ్యం, మరీదు హనుమంతు పాల్గొన్నారు.

కొనసాగిన ఆటల పోటీలు

ప్రజాశక్తి - కుక్కునూరు

సంక్రాంతిని పురస్కరించుకుని ఐదు రోజులుగా మండవ రామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు మండవ శ్యామ్‌సుందర్ రెడ్డి సౌజన్యంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా రామసింగారం పాఠశాలలో జరుగుతున్న డివిజన్ స్థాయి వాలీబాల్ కబడ్డీ, షటిల్ పోటీలు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా రేలా డ్యాన్స్, గిరిజన సాంప్రదాయ నృత్యాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా స్థానిక సర్పంచి రావు మీనావినోద్, పిహెచ్‌సి స్టాఫ్‌నర్స్ ప్రమీల, సిఐటియు మండల అధ్యక్షురాలు కె.నాగలక్ష్మి వ్యవహరించారు. ఈ సందర్భంగా మండవ రామిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మండవ శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ యువత వ్యసనాల వైపు వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో సమాజంలో మార్పుకోసం వ్యకాస ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతంలో ఏడేళ్లుగా డివిజన్ స్థాయిలో ఆటల పోటీలు, ముఖ్యంగా గిరిజన సాంప్రదాయ నృత్య పోటీలు నిర్వహిస్తున్న సంఘాన్ని అభినందించారు. విజేతలకు బహుమతులను మండవ శ్యామ్ సుందర్‌రెడ్డి, రావు మీనా, వ్యకాస జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, వైసిపి మండల నాయకులు కె.నరసింహరాజు, ఎం.వెంకన్నబాబు, రావు, వినోద్, సిఐటియు మండల కార్యదర్శి వై.సాయికిరణ్, పోలోజు నాగేశ్వరరావు, ఎం.బాబు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లువిరియాలని, భోగి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఆటపాకలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకటకృష్ణమోహన్, ఎంపిటిసి తమ్మిశెట్టి లక్ష్మి, కైకలూరు సర్పంచి నవరత్నకుమారి, తలారి జాన్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన జిఒ1 ప్రతుల దహనం

కైకలూరు రూరల్ : పౌర హక్కులకు విఘాతం కలిగించే జిఒ1ని కాలి బూడిద చేయాలని మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి నేత జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆటపాకలోని పార్టీ కార్యాలయం వద్ద భోగి మంటల్లో జిఒ ప్రతులను వేసి తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ, పార్టీ గ్రామ అధ్యక్షులు రాయినూతల సునీల్, పట్టణ అధ్యక్షులు ఎమ్‌డి.జానీ, ఎమ్‌డి ఉస్మాన్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బైక్‌పై నుంచి జారి బాలింత మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మోటారు సైకిల్ నుంచి జారిపడి బాలింత మృతి చెందిన ఘటన జాతీయ రహదారి ఉంగుటూరు వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముసునూరు మండలం గోపవరానికి చెందిన రసపత్ర నాగమణి పుట్టిళ్లు అయిన తాడేపల్లిగూడెం మండలం కెఎస్‌ఎన్ కాలనీకి ఆమె భర్త సుబ్బారావు, ముగ్గురు పిల్లలతో బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో ఉంగుటూరు వద్దకు వచ్చేసరికి ఫిట్స్ రావడంతో బైక్‌పై నుంచి పడిపోయింది. తలకు తీవ్ర గాయాలైన ఆమెను అంబులెన్సులో ఆసుపత్రికి తరలించేసరికి మృతి చెందిందని ఎస్‌ఐ కాశిస్వామి తెలిపారు. మృతురాలికి రెండున్న నెలల పసిబిడ్డతో పాటు ఏడేళ్లు, నాలుగేళ్ల వయస్సున్న పిల్లలున్నారు. ప్రమాద సమయంలో రోడ్డుపై పడిపోయిన నాగమణి ఛాతిపై రెండు నెలల పసిబిడ్డ పడతంతో బిడ్డ సురక్షితంగా బయటపడినట్లు చెబుతున్నారు. పండుగకు కూతురు, అల్లుడు, మనుమలు వస్తుండగా ఈ దుర్ఘటనతో ఆ ఇంట విషాదఛాయలు నెలకొన్నాయి.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్‌టిసి బస్సు బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని విశ్వ నాద్రిపాలెం వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరుకోల్లు వైపు నుంచి సింగరాయపాలెం వస్తున్న బైక్‌ను విజయవాడ నుంచి బీమవరం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు పెదగొన్నూరు అడ్డ రోడ్డు వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మండలంలోని చేవూరుకు చెందిన నిమ్మగడ్డ నాని (35) తలకు తీవ్రగాయ్యాలయాయి. దీంతో అతడిని స్థానికులు 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కోడిపందేల శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గోపవరం గ్రామంలో కోడిపందేల శిబిరంపై ఎస్‌ఐ ఎం.కుటంబరావు తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1500 నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు. లోపూడి గ్రామంలో కోడిపందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1500 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. చక్కపల్లి గ్రామంలో పేకాట శిబరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3800 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

కామవరపుకోటలో...

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని పంచాయతీ పాతూరు అంగన్‌వాడీ సెంటర్ ఎస్‌సి కాలనీ ఏరియాలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు కెవిపిఎస్, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ యూనియర్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసిపి గ్రామ పార్టీ నాయకుల సహకారంతో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొనాలని చెప్పారు. క్రీడలు మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. సమాజం మంచి ప్రవర్తన కలిగి మెలిగేలా గ్రామీణ క్రీడలు ఉపయోగపడాలన్నారు. పాతూరు ఎస్‌సి కాలనీలో ముగ్గులు పోటీలు, డప్పుల పోటీలు నిర్వహించి విజేతలకు స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి బొడ్డు ఝాన్సీ. రెండో బహుమతి సికాకోలు పావని, మూడో బహుమతి అల్లూరి గాయత్రి, ఎర్రంశెట్టి ఝాన్సీ, స్పెషల్ బహుమతి కొండేపూడి అన్నామేరీ, డప్పు కళాకారులు మొదటి బహుమతి శ్రీకాకుళం చిట్టియ, రెండో బహుమతి డొక్కా రాంబాబు గెలుపొందారు. విజేతలకు ఫ్రాన్సిస్ బహుమతులు అందించారు. ముగ్గుల పోటీల్లో తాను కూడా పోటీ చేస్తానని రెండు కాళ్ల పోలియోతో ఉన్న ఓ మహిళ కొండేపూడి అన్నామేరీ చాలా ఉత్సాహంగా పాల్గొని స్పెషల్ బహుమతి పొందారు. ఆమెకు ప్రజా సంఘాల తరపున ధన్యవాదాలు తెలిపారు. ముగ్గుల పోటీలు ముఖ్య నాయకులు ఎల్‌ఎస్‌సిఎస్ సాయల కనకరాజు సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామవరపుకోట వైస్ ఎంపిపి తమ్మిశెట్టి గిరిజ, సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు పొలిమెట్ల రత్నకుమారి, హెల్పర్ తగరం శిరీష పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని ఉప్పాకపాడు ఫౌండేషన్ ప్లస్ పాఠశాల సమీపంలో గ్రామ మహిళలకు షేక్ మస్తాన్, వెంకీ, గొట్టాపు వెంకటేష్, దాసరి వీర్రాజు, శ్రీను ఆధ్వర్యంలో శనివారం రంగవల్లుల పోటీ నిర్వహించారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను, పెద్దిరాజు వ్యవహరించారు. ప్రథమ బహుమతి గ్రైండర్ దలాయి వనజ, ద్వితీయ బహుమతి మిక్సీ, దాసరి తేజస్వీ, తృతీయ బహుమతి ఇస్త్రీ బాక్స్ దాసరి రాజేశ్వరి, షేక్ మస్తాన్, పెద్దిరాజు, అల్లు శ్రీను బహూకరించారు. గెలుపొందినవారికి జెకె ఎలక్ట్రికల్ వారు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

దెందులూరు : మండలంలోని కొవ్వలి జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని భోగి మంటలను వెలిగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ముసునూరులో...

ఏలూరు : సంక్రాంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో గన్‌బజార్, కబాడిగూడెంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనేది వ్యవసాయ పంటలు చేతికి వచ్చిన ఆనందంలో ప్రజలు జరుపుకోవడం ద్వారా వచ్చిందన్నారు. ఇటువంటి పండుగ సమయంలో కొందరు కోడి పందేలు, జూదం నిర్వహిస్తున్నారన్నారు. దీనికి ప్రభుత్వం, ఎంఎల్‌ఎ, మంత్రుల సపోర్టు అందించడం సిగ్గు చేటన్నారు. కోడిపందేలు, జూదం అరికట్టడంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. యువత చెడు వ్యసనాలు వైపు వెళ్లకుండా ఆటపాటలతో ఆనందంగా పండుగను జరుపకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి, నాయకులు చింటాడ వెంకటలక్ష్మి, భవ్య, ఝాన్సీ, వరలక్ష్మి, ఎస్‌కె.సైదున్నిసా, సిహెచ్.లక్ష్మి, కె.రాణి, సఖీల, ఎన్.దుర్గ పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని చిగురుకోటలో శనివారం భోగి పండుగను పురష్కరించుకొని కోమటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భోగిమంటలు, గంగిరెద్దులు, ఎడ్లబండ్లు, హరిదాసులు, ముత్యాల ముగ్గులు, ముగ్గుల రంగవల్లులతో గతంలో ఎన్నడు లేని విధంగా సాంప్రదాయ నృత్యాలు, భరతనాట్యం, వివిధ రకాల డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ విచ్చేసి ఆటల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా ఆరోగ్యకరమైన ఆటలు వైపు మొగ్గు చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి ప్రసాద్, తుమ్మ వెంకటకృష్ణ, నాగార్జున పి.శ్రీనివాస్, టి.సత్యనారాయణ, పేరం ధర్మరాజు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు గ్రామంలో శనివారం ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పిల్లి మురళీ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. మొదటి బహుమతి కొడవలి రంగమ్మ, ద్వితీయ బహుమతి చిలీ మనోహారం, తృతీయ బహుమతి చిలీ స్వరూపలకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిలీ ఆర్లప్ప, సిఐటియు నాయకులు కొడవలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని తాడువాయి పంచాయతీ చెల్లవారిగూడెం నిర్వాసిత ఏడో కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి పండుగ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌అర్ శ్రీరామపురం నిర్వాసిత కాలనీలో ముగ్గుల పోటీలను కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పెరుమాళ్ నరసింహారావు అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు బద్దే ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను కుటుంబ సమేతంగా జరుపుకోవాలన్నారు. ఈ క్రమంలో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి మిక్సీ వరకహేమశ్రీకి, ద్వితీయ బహుమతి గిన్నెల సెట్టు బద్దే రమాదేవికి, మూడో బహుమతి హాట్‌బాక్స్ సెట్టు పేరు మళ్ల శ్రావణికి అందించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందించారు. ఈ బహుమతులను భద్రాచలం చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ వరక బాలరాజు అందించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, బాలకృష్ణ, ప్రసన్న కుమార్, ముకేష్, అభి, ప్రసాద్, పవన్, వీరేంద్ర, వెంకన్న పాల్గొన్నారు.


ఉంగుటూరులో...

కలిదిండి : కోరుకొల్లులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శ్రామిక సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. యువకులకు కబడ్డీ, బాల బాలికలకు మ్యూజికల్ ఛైర్స్, పరుగుపందేల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పంతగాని ప్రకాష్, కోణాల సన్ని, పెరుమాల రమేష్, గోసంగి వినోద్ ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో...

కత్తులు దూశాయ్.. కట్టలు తెగాయ్..!

యథేచ్ఛగా కోడి పందేలు, పేకాట, గుండాట - చేతులెత్తేసిన పోలీసులు - పలుచోట్ల ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో నిర్వహణ - ఏరులై పారిన మద్యం


ఏలూరులో....

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కోడిపందేలు అడ్డుకుని తీరుతామని డాంబికాలు పోలీసులు చివరకు చేతులెత్తేశారు. సంప్రదాయాల ముసుగులో ఏలూరు టౌన్, రూరల్ మండలాలైన పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లో కోడిపందాలు జోరుగా సాగాయి. ఊరూరా భారీ టెంట్లు కోడి పందాలు, పేకాట నిర్వహించారు. పురుష పందెం రాయుళ్లే అనుకుంటే పొరపాటే.. మహిళలు, వివిధ పార్టీల నాయకులు.. అంతెందుకు సివిల్ డ్రస్సుల్లో పోలీసులు సైతం కోడిపందేల వద్ద దర్శనమిచ్చారు. ఇక బరుల్లో కోళ్ల జూలు విదిల్చి కత్తులు దూశాయి. భోగి రోజైన శనివారం ఆయా మండలాల్లో ఆంక్షలను అధిగమించి సంప్రదాయం పేరుతో నిర్వాహకులు పందెం పుంజులను బరుల్లోకి దించారు. పలుచోట్ల వాటర్ ప్రూఫ్ షామియానాలను సైతం ఏర్పాటు చేశారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులతో విఐపి గ్యాలరీలు, సాధారణ బారికేడ్లతో బరుల వద్ద ఏర్పాట్లు చేశారు. కొన్నిచోట్ల మాత్రం కత్తులు కట్టకుండా సంప్రదాయ కోడి పందేలను రాజకీయ నాయకులు ప్రారంభించారు.

కలిదిండిలో..

ఏలూరు, దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల్లోని చొదిమెళ్ల, పోణంగి, హనుమాన్‌నగర్, పాలగూడెం, కొవ్వలి, కొమడవోలు, జాలిపూడి, చాటపర్రు, పోతునూరు, గుడివాకలంక, ఆగడాలలంక, పత్తికోళ్ల లంక, పెదపాడు, పెదవేగి, జగన్నాధపురం, దెందులూరు, పెదపాడు, సత్యవోలు, వీరమ్మకుంటా, గడిపాడు, బాపిరాజుగుడెం, శ్రీరామవరం, మొండూరు తదితర చోట్ల భారీ షామియానాలు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. తొలి రోజే సుమారు రూ.10 కోట్లు చేతులు మారినట్లు సమాచారం. పలుచోట్ల కోడి పందేల నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇదంతా మొక్కుబడిగా సాగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న 13 మందిని అరెస్టు చేసి రూ.ఐదు వేల నగదు, పుంజులను స్వాధీనం చేసుకున్నారు.

ఒక్కో బరికి రూ.లక్షల్లోనే

ఆయా మండలాల్లో ఒక్కో బరికి పోలీసు స్టేషన్‌కు రూ.రెండు లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ముట్టినట్లు సమాచారం. అవికాక పోలీసులు వ్యక్తిగతంగా బరుల వద్దకు వెళ్లి నిర్వాహకుల నుంచి రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ఇక స్థానిక ప్రజాప్రతినిధులు, ఆబ్కారీ శాఖ, ఇతర అధికారుల అనుమతి పేరిట భారీగానే దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ముదినేపల్లి : ఎట్టి పరిస్థితుల్లోనూ కోడిపందేలు జరగనివ్వబోమని ప్రగల్భాలు పలికిన పోలీసులు, అధికారులు చివరకు చేతులెత్తేశారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు పోలీసులు తలవంచక తప్పలేదు. దీంతో మండలంలో తొలిరోజు శనివారం కోడిపందేలు యధేచ్ఛగా అధికార పార్టీ నాయకులు నిర్వహించారు. మండలంలోని ముదినేపల్లి, వడాలి, ఈడేపల్లి, దేవపూడి, బొమ్మినంపాడు, పేరూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరుల్లో పందేలు జోరుగా సాగాయి. మండలంలోని అన్నీ గ్రామాల నుంచి జనం పందేలకు భారీగా తరలివచ్చారు. లక్షలాది రూపాయాలు చేతులు మారినట్లు సమాచారం. పేకాట, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హడావుడి చేసినప్పటికీ ప్రతి ఏటా లాగానే ఈఏడాది కూడ యాధావిధిగా కోడిపందేలు జరుగుతున్నాయి. ఈ పందేలవైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు. దీంతో పందేలు, పేకాటరాయుళ్లు రెచ్చిపోయారు. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. బరులు జాతరను తలపించాయి. చిన్న పెద్ద తేడా లేకుండా అంతా కోడిపందేల్లో పాల్గొని జేబులు గుల్ల చేసుకుంటున్న పరిస్థితి కనిపించింది. బరుల వద్ద బారులుతీరిన కార్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌లు చూసి అంతా నోరెళ్లబెడుతున్నారు. బరులు వద్దే బిర్యానీ, ఇతర తినుబండారాల అమ్మకాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. బొమ్మినంపాడు, ఈడేపల్లి బరుల వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి పందేలు ఆడేవారిని మాత్రమే లోనికి అనుమతిస్తున్నారు.

జంగారెడ్డిగూడెం : సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేలు, గుండాట, పేకాట యథేచ్ఛగా నిర్వహించారు. జూద క్రీడలు, కోడిపందేలు అరికడతామని పోలీస్, రెవెన్యూ అధికారులు చేసిన ప్రచారం ఆర్భాటానికే పరిమితమైందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. శనివారం భోగి పండుగ సందర్భంగా పట్టణంలోని సుబ్బమ్మపేట, శ్రీనివాసపురం, దేవులపల్లి, లక్కవరం, పంగిడిగూడెం, ఎ.పోలవరం, వేగవరం ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహించారు. రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు కూడా కోడిపందేల్లో పాల్గొన్నారు. పందెం బరుల వద్ద గుండాట, నలుపు తెలుపు, లోనా బయట వంటి జూద క్రీడలు కూడా జోరుగా సాగాయి. శనివారం కోడిపందేలు, జూద క్రీడల్లో రూ.లక్షలు చేతులు మారాయని పలువురు పందెం రాయుళ్లు పేర్కొంటున్నారు. పట్టణంలో రెండు చోట్ల పేకాట క్లబ్బులు కూడా ఏర్పాటు చేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతోనే ఈ ఏడాది సంక్రాంతి సంబరాల కంటే కోడిపందేలు, జూద క్రీడలకు ఆస్కారం ఏర్పడిందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పేకాట స్థావరాల నిర్వహణకు అధికార పార్టీ నాయకులు ఒకరు బేరసారాలు సాగించారని ప్రచారం సాగుతోంది.

ఏలూరు మండలంలో..

మండవల్లి : సంక్రాంతి పురస్కరించుకుని మండవల్లి మండలంలో కోడిపందేలు, పేకాట, జూదాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. చావులపాడు, పులపర్రు, చింతపాడు, ఇంగిలంపాకలంక, భైరవపట్నం, పెరిగేగూడెం, లింగాలలో భారీ టెంట్లను వేసి కోడిపందేలను నిర్వహించారు. కోడిపందేలను అడ్డుకుని తీరుతామని హెచ్చరికలు జారి చేసిన పోలీసులు రాకపోయేసరికి బరుల వద్ద భారీ స్థాయిలో పేకాట, గుండాటలను నిర్వహించారు. గతంలో నిర్వహించిన సంక్రాంతి కోడిపందేల్లో మొదటి రోజు అంతంతమాత్రంగానే ఉండేవని, ఈసారి నిర్వహించిన కోడిపందేల్లో మొదటి రోజునే నిర్వాహకులు భారీ ఎత్తున నిర్వహించడం ఇదే మొదటిసారని ప్రజలు చర్చించుకుంటున్నారు. రెండు, మూడో రోజున నిర్వహించే కోడిపందేలు ఏ స్థాయిలో ఉంటయన్నేది ఊహలకు అందడం లేదని ప్రజలు అంటున్నారు. ఎన్నడూ లేని విధంగా మొదటి రోజునే ఇంత భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించిన నిర్వాహకులపై అసలు చర్యలు తీసుకుంటారా అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా కోడి పందేలు జోరుగా నిర్వహించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతం కావడంతో తెలంగాణలో కోడి పందేలకు అనుమతి ఇవ్వకపోవడంతో అక్కడ పందెం రాయుళ్లు మండలంలోకి రావడంతో బరుల వద్ద జనాలు బారులు తీరారు. బరుల వద్ద పేకాట, గుండాట వంటి జూద క్రీడలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

చింతలపూడి : మండలంలోని చింతలపూడి, రేచర్ల, యర్రగుంటపల్లి, చింతంపల్లి, రాఘవపురం, యండపల్లి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. చింతంపల్లి వద్ద జరిగిన పందేలకు తెలంగాణా రాష్ట్రం నుంచి పందెంరాయుళ్లు అధిక సంఖ్యల్లో తరలివచ్చారు. రేచర్ల గ్రామంలో రాత్రిపూట పందేళ్ల నిర్వహించటానికి లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

కలిదిండి : పోలీసుల హెచ్చరికలు భేఖాతరు చేస్తూ మండలంలో కోడి పందేల బరులు యథేచ్ఛగా ప్రారంభించారు. కోడి పందేలతో పాటు పేకాట, గుండాట వంటి జూద క్రీడలు బరుల ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. మండలంలోని పోతుమర్రు, గొల్లగూడెం, తాడినాడ, సానారుద్రవరం, కొరుకొల్లు, పేట కలిదిండి, కోట కలిదిండి, మిలటరీ పేట, కొండంగి, పెదలంక గ్రామాల్లో కోడి పందేల శిబిరాలు ఏర్పాటు చేశారు. పందెం రాయుళ్ల ను ఆకట్టుకునేలా ఫ్లెక్సీలను, స్టాళ్లను ఏర్పాటు చేశారు. పందెం బరుల చుట్టూ ఇనుప కంచె ఏర్పాటుతో పాటు తమ ప్రత్యేక సిబ్బందిని నియమించారు. పోతుమర్రులో ఓ ఇంటి ప్రాంగణంలో లోనికి పందెం రాయుళ్లు మాత్రమే అనుమతి ఉండేలా టోకెన్లు మంజూరు చేసి గుట్టుగా పందేలు నిర్వహిస్తున్నారు. స్థానిక నాయకుల కన్నుసన్నల్లో పలు శిబిరాలు ఏర్పాటు కాగా మరికొన్ని చోట్ల నాయకులే శిబిరాలను ఏర్పాటు చేశారు.

ముసునూరు : మండలంలోని గోపవరం, చక్కపల్లి, లోపూడి గ్రామాల్లోని బరుల్లో అధిక మొత్తంలో రూ.లక్షల్లో కోడిపందేలు జరిగాయి. పేకాట, గుండాట, మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి.

కైకలూరు: మండలంలో కోడి పందేలు, పేకాట యధేచ్ఛగాక నిర్వహించారు. రూ.కోట్లాది రూపాయలు చేతలు మారాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు అటువైపు చూడలేదు. మండలంలోని ఆటపాక, వదర్లపాడు, భుజబలపట్నం, ఆలపాడు, కొల్లేటికోట, ఆచవరం, వేమవరపాడు, వరాహపట్నం, రాచపట్నం తదితర గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించారు. కైకలూరులో పేకాట పెద్దఎత్తున సాగింది. అధికార, ప్రతిపక్ష నాయకులు ఈ పందేలను లాంఛనంగా ప్రారంభించడం గమనార్హం.

జీలుగుమిల్లిలో....

పాస్‌పోర్ట్ పోయినది

ఆచంట గ్రామం మరియు మండలంకు చెందిన గుత్తుల ఏసుబాబు అను నేను వైజాగ్‌లో 15-06-2017లో పొందిన **R 2776523** **పాస్‌పోర్ట్‌ను** 02-01-2023 సోమవారం ఆచంటలోని మెయిన్ సెంటర్లో జిరాక్స్ తీసుకొని మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా దారిలో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందచేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

గుత్తుల ఏసుబాబు
తండ్రి: వెంకటేశ్వర రావు,
పాత డోర్ నెం. 23-146,
కొత్త డోర్ నెం.23-124/1,
మానే వారిపాలెం, ఆచంట
ఆచంట మండలం, ప॥గో॥జిల్లా
సెల్ నెంబర్: 86889 17561

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 21/2022 ఇన్
ఓ.ఎస్.నెం. 162/2010

బిట్వీన్:
గంగుల వెంకటేశ్వరరావు
...డి.హెచ్.ఆర్ /వాది
మరియు
1) జెట్టి సాయిబాబా (డైడ్) వగైరాలు
...జె.డి.ఆర్స్

టు: 4వ రెస్పాండెంటు:
జెట్టి లక్ష్మీనాథ్, తండ్రి: లేటు సాయిబాబా, డో.నెం. 1-19, వీరబ్రహ్మంగారి గుడి దగ్గర, రాయలం, భీమవరం మండలం.

పై నెంబరు ఇ.పి.లో మీకు కోర్టు నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిచిననూ మీరు తీసుకొనుటకు నిరాకరించినందున శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు **ది.08-02-2022న ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని లేక అడ్వకేట్ ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించుకోవలసిందిగా తెలియజేయడమైనది.** లేనిపక్షంలో మీ పరోక్షమందు శ్రీ కోర్టు వారు తీర్మానించడం జరుగునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

జి.వి.స్టీఫెన్ బాబు,
పచ్చిగోళ్ళ రమేష్, అడ్వకేట్స్,
భీమవరం.
భీమవరం,
13-1-23.
సెల్: 87909 50666